# అబ్బాయి - నాన్న

●

"చెప్పండి...మరి!"

"ఏమిటి ?"

"చందమామను...చంద్రుణ్ణీ, మామ అని ఎందుకు పిలవడం?"

"ఏమో"

"ఓస్...ఇంతేనా..."

"ఐతే, చెప్పనా..."

"ఆఁ..."

"నీవు ఒప్పుకుంటావా?"

"ముందు చెప్పండి. గెలువలేక..."

"నీలాటి చక్కని చుక్కలు కూతుళ్ళుండటంచేత..."

"సంతోషించారు తెలివికి, తమరెవరో అప్పుడు?"

"మేం లక్ష్మీపుత్రులం!"

"ఓహో...అదా సంగతి! రోజూ తోటలో పూలన్నీ మాయమవుతూంటే...ఏమైపోతున్నాయా అనుకుంటున్నా. ఎవరిమీద ప్రయోగించడానికేం బాణసంచాంతా?"

"అదికాదండి...నాకు తెలుసులే...దేవిగారికి తల జారి, దండలు అమరటంలేదని గునుపు"

"పోనీ తీసుకోండి మీ క్రాపింగు...లో...కి..."

"నవ్వు...ఆలాగే...నవ్వితే నే నూరుకోను..."

"ఐతే కోపం తెప్పించుకుంటా...ఇదుగో, బుంగ మూతిపెడుతున్నా...వచ్చేసింది...ఉహూఁ..."

"ఇదుగో...ఓయ్! ... ఊ!...పలకవ్వూ? ఏమిటి నిజంగా కోపంవచ్చినట్లేనా? ఉహుఁ! అలాఅయితే నేను నవ్వుకోను.అన్నింటికీ ఓమాదిరిగానే తలఊగిస్తే ఏలా? కోపంరాలేదా? వచ్చిందా? వచ్చిందీ? సై...ఇక కాచుకో, చక్కలిగింతపెట్టనా— నవ్వకూడదు—ఏం...సరేనా?"

*　　*　　*　　*

"ఏమి టా కిచకిచలు? ఇంకా మేలుకునేఉన్నార్రా?

"......................."

"వినబడుతూనేఉందిలే నవ్వు. మీరు మాట్లాడక పోయినా—"

"ఇక చాలించండి, ప్రొద్దుపోయింది. అమ్మాయి!ఇక పడుకో అమ్మా! ఓపలేనిపిల్లవు. ఒళ్ళు భారకిస్తుంది. వాడి కేంలే? అలవాటుగా తెల్లవార్లూ మేలుకోవడం!"

*　　*　　*　　*

"చెపుతే విన నేర్పులే దేంచేతునమ్మా ? వాడు వాడే; అది అదే,...ఇదుగోనర్రా! ఇక నేనూరుకోను."

"...మరే...అమ్మమ్మా..."

"కాదండీ...అమ్మమ్మగారూ...ఈయనే..."

"చూడవే...న...వ్వి...స్తాం...ది...నే...ను.."

*　　*　　*　　*

"మీ యిష్టం మీది నాయనా...ఉండండి, మెట్ల గదిలోకి వెళ్ళి పెద్దమీట వేసేస్తా...దీపాలున్నంతవరకూ—"

*　　*　　*　　*

"అమ్మమ్మా! వెన్నెల్లో నీ మనుమగాలే..."

ఊఁ!అఘోరించండి...మీయిల్లు బంగారంగానూ"

## ౨

"చూడండి..."

—మిమ్మల్నే..."

—అక్కడకాదు—ఈలా రండి..."

—అబ్బ! రండి...ఇంతలో మరేం అరిగిపోరు..."

—ఓ! పిలిచినకొద్దీ బిగింపు ఎక్కువౌతూందేం? మిమ్మల్ని ఎవరూ కొరుక్కుతినరు లెండి—రద్దురూ...

"ఎందుకూ?"

"...అలా చూడ రేం. పాప పిలుస్తున్నాడు..."

"ఆ...నీఅంతవాడే...తక్కువా ఏం?"

"కాదండీ...మీఅంతవాడు. మీ గుణాలన్నీ అప్పుడే అబ్బినాయ్. అనుక్షణం అనుసరించిఉండాలికద...ఓస్!... లేదమ్మా! మా నాన్న! మా బంగారుతండ్రి! నిన్నుకాదమ్మా! అబ్బ! ఎంత రోషమొచ్చిందో! ఒక్కమారు తీసుకోండి. ఏలా చేతులు చాస్తున్నాడో..."

—కే. ఆ. వు... కే...వు... కే...వుం...గాఆ...

"పోనీలెండి......తెలియడంలా ? వాడిభాషలో నన్నెత్తుకోవు?...అని ఏలా పిలుస్తున్నాడో..."

"...ఇంతమాత్రం కవిత్వం నాకూ చేతనవును. నీవు పనికిరావు...అమ్మవుకావు...అంటున్నాడు, సరేనా..."

"మహా నేర్చారులెండి మాటలు..."

"మాట..."

"................."

"పాపని...అమ్మమ్మకు యిచ్చి—"

—ఏం ?

—వినిపించలా ?

—ఏమిటి ?

"నాకు తెలియదు బాబూ! ఆవిడకిస్తే వా డూరుకోడు...పని వేళప్పుడు—"

"ఆలాగైతే..."

"వాణ్ని చూడండి...ఊహుఁ అంటున్నాడు. వల్ల కాదు..."

"ఊహూ...నేనూ అంటా వల్లకాదని..."

"మీా అమ్మమ్మదగ్గర పోయి కూర్చుంటా!!"

3

"అమ్మాయ్!...అదేమిటే? అలా మాటిమాటికీ తొట్టె కుదుపుతూంటే మళ్ళా మేలుకుంటున్నాడు? అసలే

కొంటుకోణంగి. పోనీ, కాస్సేపు కాళ్ళమీద వేసుకుని చిచ్చిగొట్టు...అంత ఎగరేయకు, ఉలికిపడతాడు...ఒక్క పావుగంట ఆడించు. నేను మడివిడిచి ఇవతలకువచ్చి తీసుకుంటా—..."

*    *    *    *

"ఇంకా, పడుకోలా వాడు?"

"ఉహుం. ష్. బిగ్గరగా అనకండి...ఇప్పుడే కాస్త కునుకుతున్నాడు...మళ్ళా లేస్తే నన్ను నేపుకుతింటాడు..."

"వీడొకడు...దొరికాడు..."

"......................"

"నిజంగానే వెన్నెలరాత్రుల్లో ఎంత హాయిగా ఉండేవాళ్ళం? ఇప్పుడు—"

"ఆఁ...మీకు ఎప్పుడూ అదే రంధి..."

"అవును...నా ఆనందానికి అనుభవానికి అడ్డం గొట్టడానికి పుట్టాడు, వీడు..."

"ఏమిటా మాటలు?—"

"ఏమిటా...నీతో మాట్లాడటానికైనా నాకు ఇప్పుడు స్వాతంత్రంలేదు. బిగ్గరగా పిలువకూడదు. అబ్బాయి ఉలికిపడతాడు. బిగ్గరగా నడవకూడదు. ఆయన మేలుకుంటాడు. నీవు నాతో కాస్సేపు తీరికగా ఉండకూడదు. ఆ మహారాజాధిరాజు పోరు మొదలెడుతాడు. ఐతే, నేను ఇక ఇంట్లోనూ ఉండకూడదు. అలాగైతే?"

"ఎక్కడ నేర్చుకున్నారు ఈ పాఠమంతా? మీకే ఉన్నారా మహా పిల్లలు? గాలికి తిరిగివచ్చి కబుర్లుచెప్ప

డానికే మీకు యింత కష్టమైతే, అస్తమానం కనిపెట్టుకుని కూర్చునేదానికి నాకు ఏలాఉంటుంది...ఐనా మన పిల్ల వాడికి మనం చేసుకోవడం అబ్బురమా? ఒకరికి మెప్పా? వాడుమాత్రం అందరిపిల్లలలాగా విసిగిస్తాడా?"

"వెనుక వేసుకు వస్తున్నావ్! అవును, నీకు వాడి తోనే లోకం. నా మాట—"

"ఆ...మీ మాట...మీరు చెప్పేమాట ఏమిటో నాకు తెలుసు. కొత్తా."

"ఊఁ...వీడిమూలానే నాకు నీవు దూరమౌతున్నావ్. ఐనావు. ఎందుకు పుట్టాలీ...వీడు?"

*　　*　　*　　*

"వింటున్నా మీ చిలుకపలుకులు. మహా లక్షణంగా ఉన్నాయ్..."

"కాదే అమ్మమ్మా!..."

"చూడండి! వాళ్ళఅబ్బాయితో యుద్ధంచేస్తున్నారు"

"అవును...వాడు ఎందుకుపుట్టాలి..."

"అలాగేం? నాగన్నా! నీవు ఎందుకు పుట్టావు?"

"మా అమ్మ కన్నది..."

"మీ అమ్మ కంటేమాత్రం, నువ్వు ఎందుకు పుట్ట డానికి ఒప్పుకున్నావూ? నిన్ను కాకపోతే ఇంకొకడ్ని కనేది. కడుపుతూన్నమ్మ కనక మానుతుందా? వండుకున్నమ్మ తినక మానుతుందా?

"ఏం..."

"..................."

"జవాబు చెప్పవేం? ఇందాకనుంచీ నోరులేని పసి కుంకవాడిమీద ఎగిరావ్... చెప్పు మరి?"

*        *        *        *

"మీగూ...మీ వేషాలూనూ. ఎత్తుకో...ఓమారు ఎత్తుకు తిప్పు. ఎందరు ఎత్తుకోందీ ఇంతవాడవైనావ్? నేనూ బతికుంటే చూడకపోతానుటలే? వాడూ రేపు ఈపాటికి బతికి బట్టకడితే వాడిపెళ్ళాందగ్గిరా ఈలాగే ధీమాకులుచేస్తాడు. అప్పుడు మనవణ్ణి నీవే ఎత్తుకు మోయాలి. చాల్లే;—ఇక ఈలాతే...ఈ నిమిషానికే పండుతండ్రిని పిసిగేశావ్. ఈ కాలంవాళ్ళకు...ఏదీ తెలియదు. అదేంలోకమో? పోన్లే నాయనా! నీవు నాదగ్గిరే పడుకుందువుకాని. మీ అమ్మను నాయన్నీ గంతులేసుకోమను. ఇదుగోనే అమ్మాయి...! నవ్వొస్తే ఆపుకోవాలికాని - విరగబడుతూ, పరిగెత్తితే ఎలాగే? ఒక్కమారు వీణ్ణి తీసుకో..."

—.—